కరపత్రం

## పేద, దళిత, బలహీనవర్గాల డాక్టరు, పౌరహక్కుల సంఘనేత

## డా॥టి.రాజారావుగారిపై బనాయించిన తప్పుడు కేసులను వెంటనే రద్దుచేయాలి.

## బాధ్యులైన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

**8-3-2016** తేదీన గుంటూరు జిల్లా పొన్నూరులోని ప్రజావైద్యశాల వైద్యులైన డా॥ టి. రాజారావుగారు, టి.రమేష్ అనే న్యాయవాదితో కలసి చందోలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి 'గాయాలతో రిపోర్టు ఇవ్వటానికి వచ్చిన వ్యక్తుల రిపోర్టు ఎందుకు తీసుకోర'ని ప్రశ్నించారు. ప్రశ్నించటమే నేరంగా భావించిన డి.యస్.పి. మరియు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మరియు చందోలు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు డాక్టరుగారిపట్ల అమర్యాదకరంగా మాట్లాడి, భౌతికంగా దాడిచేసి డాక్టర్‌గారిని ఒక వరకట్నం హత్యకేసులో ముద్దాయిగా చేర్చటానికి కుట్రపన్ని ఫిర్యాదుదారులను మరలా పిలిపించి అప్పటికే ఇచ్చిన ఎఫ్.ఐ.ఆర్.ను చించివేసి డాక్టరు గారిని ఒక ముద్దాయిగా చేర్చుతూ, మరొక తప్పుడు ఎఫ్.ఐ.ఆర్.ను సృష్టించినారు. దీనిపై డాక్టర్ రాజారావుగారు బాపట్ల మెజిస్ట్రేట్ కోర్టులో బాపట్ల డి.యస్.పి. మరియు రూరల్ సి.ఐ. గార్లపైన మరియు ఇతర బాధ్యులపైన ప్రైవేటు కేసు దాఖలు చేసియున్నారు. ఆ కేసులో బాపట్ల మెజిస్ట్రేట్, సాక్షుల స్టేట్‌మెంట్‌లను రికార్డుచేసి 14-9-2016 తేదీకి విచారణ స్వీకరించే విషయమై వాయిదా వేసియున్నారు.

ఈ నేపథ్యంలో డాక్టర్ రాజారావుగారు, బాపట్ల డి.యస్.పి.పై పెట్టిన ప్రైవేటు కేసును రద్దుచేసుకునే విధంగా వత్తిడి చేయాలనే దురుద్దేశంతో బాపట్ల డి.యస్.పి. పరిధిలోని పొన్నూరు అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భర్తను కోల్పోయి ఒంటరిగా జీవించుచున్న ఒక దళిత మహిళను ప్రభావితంచేసి డాక్టరు రాజారావు గారిపై తప్పుడు రిపోర్టు బనాయించి రేప్ కేసుగా రిజిస్టర్ చేసినారు. రిపోర్టులోని విషయాల ప్రకారము ఒక దళిత మహిళ తనకాలనీలో వుండే ఒక యస్.టి. వ్యక్తిని తీసుకొని కడుపునొప్పితో డాక్టర్ రాజారావుగారి హాస్పిటల్‌కు వచ్చినట్లు, డాక్టర్ రాజారావు వైద్యపరీక్ష చేయుచూ అసభ్యంగా ప్రవర్తించినట్లు, ఆమె భయపడి డాక్టర్ గారిని నెట్టివేసి గదిలోనుంచి బయటకు వచ్చినట్లు, ఈ విషయం తనతో వచ్చిన యస్.టి. వ్యక్తికి చెప్పి కన్నీళ్ళు పెట్టుకున్నట్లు, ఆ యస్.టి. వ్యక్తి ఇలా మరో ఆడమనిషికి జరగటానికి వీలులేదని పోలీస్ రిపోర్టు ఇచ్చినట్లు వ్రాసినారు.

కేసు పూర్వాపరాలను, వాస్తవాలను పొన్నూరులోని అన్ని పౌర, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు, వ్యక్తులు, మేధావులు విచారించి నిర్ధారించిన వాస్తవాలను ప్రజల ముందు వుంచుతున్నాము.

డాక్టర్ రాజారావుగారు గత 30 సంవత్సరములుగా పొన్నూరులో డాక్టర్‌గా ప్రాక్టీస్‌చేస్తూ దళిత, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఎంత సేవ చేశారో మనందరికి తెలుసు. ప్రతిరోజు వైద్యశాలలో రాజారావుగారు కనీసం 50మందిని పరీక్షచేస్తారు. అందులో కనీసం 30మంది మహిళలు వుంటారు. గత 30 సంవత్సరాలుగా ఏనాడూ ఈ విధమైన అసభ్య ఆరోపణలకు అవకాశం లేకుండా ఎంతో నిబద్ధతతో వైద్యసేవ చేస్తున్న డాక్టర్ టి.రాజారావుగారిపై కక్షసాధింపు చర్యగా, పోలీసులపై ప్రైవేటు కేసు రద్దుకొరకు డాక్టర్‌గారిపై ఒత్తిడి తీసుకు రావటానికి పోలీసులే ఈ కేసు బనాయించారని కేసు పూర్వాపరాలను, సాక్ష్యాధారాలను, పరిశీలించితే సామాన్యులకు సైతం అవగతం అయ్యే విషయం.

డాక్టర్ రాజారావుగారి హాస్పిటల్‌లో మందులషాపు యజమాని తన వ్యాపార అవసరాలకోసం సి.సి. కెమేరాలను అమర్చుకున్నాడు. అందులో ఒక కెమేరా మందులషాపునుండి డాక్టర్‌గారు పరీక్షించే రూమ్ వరకు వుండే వరండా మొత్తానికి ఫోకస్ చేయబడి, కవర్‌చేస్తూ వుంటుంది. ప్రతిరోజు ఎవరు డాక్టర్‌గారి పరీక్షలకోసం లోపలకు వెళుతున్నారు, బయటకు వస్తున్నారు అనేది రికార్డు అవుతున్నది.

ఆ కెమేరాలో రికార్డు అయినదాన్నిబట్టి రిపోర్టు ఇచ్చిన మహిళ ఎఫ్.ఐ.ఆర్‌లో చెప్పిన వ్యక్తితో కాకుండా వేరే వ్యక్తితో హాస్పటల్‌కు వచ్చింది. ఆమెకు ముందు ఇద్దరు పేషెంట్లు ఆ తర్వాత పేషంట్లు ఇద్దరు, ఇక ఆడ నర్సు, ఒక మగ కాంపౌండర్, ఒక మెడికల్ రిప్రజంటేటివ్ కూడా డాక్టర్‌గారి గదిలో వున్నట్లు రికార్డు అయినది. డాక్టర్‌గారి పరీక్షల అనంతరం ఈ మహిళ బయటకువచ్చి డాక్టర్‌గారు వ్రాసి ఇచ్చిన ఔట్ పేషంట్ కార్డు మరియు రక్త/మూత్ర పరీక్షలకోసం వ్రాసిన చీటిని తన వెంట వచ్చిన వ్యక్తికి ఇచ్చి వారు కొద్దిసేపు మాట్లాడుకుంటూ అక్కడే వరండాలో నిలబడివుండటం, ఆ వెంట వచ్చిన వ్యక్తి ఆమెను ఏదో అనటం, అతడు అడిగిన మాటకు ఫిర్యాది అయిన మహిళ పడిపడి నవ్వటం కూడా ఆ కెమేరా ద్వారా రికార్డు కాబడినది. దీన్ని ప్రజాసంఘాలు పరిశీలించాయి. అదేవిధంగా ఎఫ్.ఐ.ఆర్.లో సాక్షిగా వ్రాయబడిన వ్యక్తి అసలు హాస్పిటల్‌కే రాలేదు. పైగా ఆ వ్యక్తి ఇప్పటికే ఒక రేప్ కేసులో మరియు మరికొన్ని పోలీస్ కేసులలోను ముద్దాయిగా వున్నాడు. ఈ విషయాలన్నీ పరిశీలించిన ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రజాసంఘాలవారు ఈ అక్రమ కేసును ఖండిస్తూ పత్రికా ప్రకటనలు చేసియున్నారు. పొన్నూరు డాక్టర్ల సంఘం (ఐ.ఎం.ఎ) దీనిని ఖండించింది.

ఈ విషయాలను జీర్ణించుకోలేని పోలీసులు ఆ దళిత మహిళను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎవ్వరో ముసుగువేసుకున్న వ్యక్తులు కేసు వెనక్కు తీసుకొనకపోతే చంపుతామని బెదిరించుచున్నారని మరో స్టేట్‌మెంట్ ఇప్పించి, మరో కేసును రిజిస్టర్ చేయుటకు

ప్రయత్నం చేయుచున్నారు. డాక్టరుగారిని మరింతగా వేధించి పోలీసులపై పెట్టిన ప్రైవేటు కేసును వదులుకునే విధంగా ఒత్తిడి తీసుకురావటానికి ఈ స్టేట్‌మెంట్లు ఆ మహిళచే బాపట్ల డి.యస్.పి.యే ఇప్పించుచున్నారు. ఈ విషయాలను డాక్టరు రాజారావు కుటుంబ సభ్యులు వివిధ ప్రజాసంఘాలవారు, గుంటూరుజిల్లా రూరల్ యస్.పి.గారికి మరియు గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌వారికి 23-9-2016 తేదీన విజ్ఞాపన పత్రాలు సమర్పించుటద్వారా తెలియజేసియున్నారు. ఆ వెంటనే 24-9-2016 తేదీన మళ్ళీ ఆ మహిళను బాపట్ల పిలిపించుకొని బాపట్ల డి.యస్.పి.కి ఆ మహిళ మరో రిపోర్టు ఇచ్చినట్లుగాను డాక్టర్‌గారిపై "గతంలోను కొన్ని కేసులు" వున్నాయని, ఫిర్యాదుచేయని సంఘటనలు కొన్ని వున్నాయని తన దర్యాప్తులో తేలిందని, నిందితునిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని డి.యస్.పి. మహేష్ పేర్కొన్నారని ఈనాడు క్రైమ్ గ్రాఫ్‌లో ఒక ప్రకటన వచ్చింది.

ఈ ప్రకటనతో బాపట్ల డి.యస్.పి. మహేష్ వ్యక్తిగతంగా రంగంలోకి దిగి డాక్టర్ రాజారావుగారిపై మరిన్ని తప్పుడు కేసులు బనాయించటానికి కుట్రపన్నారని ఋజువగుచున్నది. యస్.సి. కులానికిచెందిన డాక్టర్ రాజారావుగారిపై ఒ.సి. కులానికి చెందిన డి.యస్.పి., నిరాధారమైన, అవమానకరమైన అసత్య ఆరోపణలు సదరు ప్రకటనద్వారా చేసి పబ్లిక్‌లో అవమానించడం యస్.సి. మరియు యస్.టి. (అత్యాచారాల నిరోధక) చట్టం ప్రకారం కూడా నేరమే.

చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యతాయుత పదవిలోవుండి, సొర్ధప్రయోజనాలకోసం, చట్టవిరుద్ధంగా, డాక్టర్ రాజారావుగారిపై దురుద్దేశ్యపూర్వకంగా, తప్పుడు కేసులు బనాయిస్తున్న బాపట్ల డి.యస్.పి. పరిధిలోని క్రైం నెం. 151/2016 పొన్నూరు అర్బన్ పి.ఎస్.కేసును బాపట్ల డి.ఎస్.పి. పరిధి నుంచి తప్పించి సి.ఐ.డి. పరిధిలోని ఎస్.పి. స్థాయి అధికారిచే విచారణ జరిపించాలని, తప్పుడు కేసులకు బాధ్యులైన పోలీసు అధికారులను చట్టప్రకారం శిక్షించాలని మరియు రాజారావుగారిపై పెట్టిన తప్పుడు కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

పై డిమాండ్ల సాధనకోసం పొన్నూరు పౌర ప్రజాస్వామిక, మానవహక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాలు, ప్రజలతో ఏర్పడిన ఐక్య కార్యాచరణ కార్యక్రమాలలో పాల్గొని, న్యాయంకోసం జరిగే పోరాటంలో కలసి రావాలని అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

**పొన్నూరు పౌర, మానవ హక్కుల సంఘాలు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, ప్రజలతో ఏర్పడిన ఐక్యకార్యాచరణ వేదిక-పొన్నూరు**

ooooo